క్లుప్తంగా

6 నుంచి గోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలు


ర్యాలి గోపాలస్వామివారు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసిన జగన్మోహినీ కేశవస్వామి వారి దేవస్థానం క్షేత్ర పాలకుడు గోపాలస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల ఆరో తేదీ ఏకాదశి నుంచి 12వ తేదీ పాడ్యమి వరకు జరుగుతాయని దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. ఆరో తేదీ సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణ, అనంతరం స్వామివారి కల్యాణం, ఎనిమిదిన సాయంత్రం సదస్యం, 11న ఉదయం పూర్ణాహుతి, అనంతరం చక్రస్నానం, 12న రాత్రి శ్రీపుష్పోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ వివరించారు. భక్తులు, దాతలు, గ్రామస్తులు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సతీష్‌కు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


సతీష్‌ను పరామర్శిస్తున్న కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: రోడ్డు ప్రమాదంలో ఇటీవల తీవ్ర గాయాలపాలై వక్కలంకలో విశ్రాంతి తీసుకుంటున్న పిల్లి సతీష్‌ను జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పెదబాబు, యల్లమిల్లి జయబాబు, కోట విజయరాజు, వాసంశెట్టి వీరాంజనేయులు, పిల్లి రమేష్, మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పెదబాబుకు గొల్లపల్లి పరామర్శ


పెదబాబును పరామర్శిస్తున్న సూర్యారావు

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక మాజీ సర్పంచ్ ఉయ్యూరు పెదబాబును శుక్రవారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. పెదబాబు భార్య వెంకటరమణ గురువారం హైదరాబాదులో అనారోగ్యంతో మరణించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె భౌతికకాయం వద్ద గొల్లపల్లి నివాళులర్పించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, కంతేటి వెంకట్రామరాజు, జాన శంకరరావు, కుసుమ చంద్రశేఖర్, కె.భాస్కరనాగేశ్వరరావు, సర్నెళ్ల విజయప్రసాద్, తాడి సహదేవ్ తదితరులు పెదబాబును పరామర్శించారు.

అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

మలికిపురం: ప్రతి నెలా ఇచ్చే పెన్షన్లకు అర్హులైన వారు చాలా మంది ఉన్నారని, వారందరికీ పెన్షన్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు డిమాండ్ చేశారు. లక్కవరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హత లేనివారు కూడా రాజకీయ అండతో పెన్షన్లు పొందుతున్నారని, అటువంటి వారిని తొలగించి అర్హులైన వారికి ఇవ్వాలని కోరారు. పెన్షన్ల మాదిరిగానే రేషన్ బియ్యం కూడా మూడు నెలల్లో ఎప్పుడైనా తీసుకునే పద్ధతిని ప్రవేశపెట్టాలన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మొటిపల్లి రామ్‌కిరణ్, రూ.12,511, ధవళేశ్వరానికి చెందిన కోసూరి వెంకట సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.


దాత మొటిపల్లికి స్వామి చిత్రపటం ఇస్తున్న అర్చకుడు

ఆటంకాలువ

- పంట కాలువల పొడవునా ఆక్రమణలు
- గ్రామాల్లో చెత్తంతా కాలువల్లోకే..
- దుర్వాసనతో జనం బెంబేలు
- చర్యలు తీసుకోని అధికారులు

మామిడికుదురు: పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. అనేక చోట్ల కాలువల పొడవునా పక్కా కట్టడాలు నిర్మించారు. ఆయా ఆక్రమణల్లో షాపులు పెట్టుకున్నారు. ఎక్కడ చూసినా ఆక్రమణలే. కాలువల పక్కన పెట్టిన షాపుల నుంచి చెత్తంతా తీసుకువచ్చి కాలువల్లోకే పడేస్తున్నారు. పంట కాలువలు అనే కంటే.. పెంట కాలువలు అన్న పేరు సరిగ్గా సరిపోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొగలికుదురు, మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, ఈదరాడ, కొమరాడ, లూటుకుర్రు, తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. చెత్తతో పంట కాలువలు కాస్తా డ్రైనేజీలను తలపిస్తున్నాయి. డ్రైనేజీలే నయం అన్న విధంగా పరిస్థితి తయారైంది. కాలువ పొడవునా ఎక్కడకు వెళ్లినా ముక్కు మూసుకోవాల్సిందే. కాలువలను ప్రక్షాళన చేసే దిశగా నీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ యంత్రాంగం ఏవిధమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి.


మొగలికుదురులో పంట కాలువ చెంతనే చెత్తాచెదారం

తాగునీటి ప్రాజెక్టులకు కలుషిత నీరు

లక్షలాది మంది ప్రజలకు నిత్యం తాగునీటి ప్రాజెక్టుల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఆయా ప్రాజెక్టులకు కాలువల ద్వారా ప్రవహిస్తున్న కలుషిత నీరే శరణ్యమవుతోంది. పాశర్లపూడిలోని కొట్టుమెరక, ఈదరాడ గ్రామాల్లోని ప్రధాన ప్రాజెక్టులకు ఈ కాలువల ద్వారా వచ్చే నీటినే పంపింగ్ చేస్తున్నారు. కాలువల నుంచి వచ్చే నీటిని శుద్ధి చేస్తున్నా, కలుషిత నీటి ప్రభావం ప్రజలపై తప్పనిసరిగా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలువల్లో చెత్త వేయడంతో పాటు, కాలువలకు రెండు వైపులా ఉన్న ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని సైతం ఇదే కాలువల్లోకి విడిచి పెడుతున్నా, ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు ఉన్నారని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఇరిగేషన్ కాలువల పక్కన ఉన్న ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించి, వాటిని పక్కాగా తీర్చిదిద్దాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మొగలికుదురులో పంట కాలువ పక్కన వెలసిన ఆక్రమణలు

పంట కాలువలను ప్రక్షాళన చేయాలి



పూర్తి స్థాయిలో పంట కాలువలను ప్రక్షాళన చేయాలి. పంట కాలువల్లో దిగాలంటేనే భయంగా ఉంది. ఎక్కడికక్కడ చెత్తను కాలువల్లో పడేస్తున్నారు. దీనికితోడు ఇళ్ల డ్రైనేజ్ గొట్టాలు కూడా కాలువల్లోకి ఏర్పాటు చేశారు. వీటిని పూర్తిగా తొలగించాలి. ఎంతో కాలం నుంచి ఈ దిశగా చర్యలు తీసుకుంటారోమోనని ఆశిస్తున్నా నెరవేరడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– యాండ్ర పుల్లయ్య, రైతు, మొగలికుదురు

ఆక్రమణలతోనే సమస్యలు



ఎక్కడ చూసినా పంట కాలువలు చాలా అధ్వానంగా ఉన్నాయి. ఆక్రమణల తొలగింపుతోనే సమస్య పరిష్కారం అవుతుంది. మందుబాబులు రాత్రి సమయాల్లో మద్యం సేవించి కాలువల్లో సీసాలను పగులగొట్టి పడేస్తున్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి వారి చర్యలను అరికట్టాలి. కాలువల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన తూరలను తొలగించాలి. కాలువలను బాగు చేయాలి.

– గంధం విజయ శ్రీనివాసరావు, రైతు, గెద్దాడ

సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలి


చింతలూరులో డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్య పరిస్థితులు నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని వైద్యారోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు చేరవని, అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించి.. మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలి

అంబాజీపేట: గంగలకుర్రు సమీకృత వసతి గృహంలో చేపడతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, వసతి గృహానికి రంగులు వేయడంతో పాటు, ఫ్లోరింగ్, విద్యార్థుల మరుగుదొడ్లకు తలుపులు, ఫ్యాన్లు, విద్యుత్ వైరింగ్, శ్లాబ్ ఫ్లోరింగ్ పనులను రూ.17 లక్షలతో చేయనున్నట్టు వివరించారు. పాఠశాలలు తెరిచే నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు ఉన్నారు.


వసతి గృహంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బెల్లపు ఊట ధ్వంసం

కొత్తపేట: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. అమలాపురం ఏఈఎస్ జి.అమర్‌బాబు ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం పేరవరం సమీపంలోని గోదావరి లంకలో సారా తయారీకి వాడే బెల్లపు ఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికితీసి, ఊటను ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి అదే గ్రామానికి చెందిన బెజవాడ సత్తియ్యపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ కె.చంద్రశేఖర్, ఎస్సై కె.అన్నవరం (కొత్తపేట), కె.సుబ్బారావు (రామచంద్రపురం), సిబ్బంది పాల్గొన్నారు.


గోదావరి లంకలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పశువుల దాణా పంపిణీ


పశువుల దాణా పంపిణీ చేస్తున్న సర్పంచ్

మలికిపురం: మండలంలోని గూడపల్లి గ్రామంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. గూడపల్లితో పాటు, పల్లిపాలెం, గుబ్బలపాలెం గ్రామాల రైతులకు కూడా అందించారు. పల్లిపాలెం సర్పంచ్ పెచ్చెట్టి నరసింహాస్వామి, మండల ఉపాధ్యక్షులు సుందర శ్రీను, నాయకులు సుందర బ్రహ్మయ్య, కొణిదెల శ్రీను, కటికిరెడ్డి గోపాలకృష్ణ, ఆచంట తాతాజీ, వైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు


స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

అయినవిల్లి: నేదునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వేంచేసిన ఆంజనేయ స్వామివారికి జయంతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు పెదపూడి గోపాలచార్యులు ఆధ్వర్యంలో పది మంది పండితులు ఈ పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకం, శాంతి హోమం వంటి విశేష కార్యక్రమాలు జరిగాయి. 120 మంది భక్త దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగ్ని బాధిత కుటుంబానికి చేయూత

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక గ్రామ పరిధిలోని తోటవారి మెరకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనిచ్చింది. ఈ మేరకు జిల్లా ఐఆర్ఎస్ ప్రెసిడెంట్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలపై జిల్లా ఐఆర్ఎస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో బాధితురాలు కోళ్ల వెంకాయమ్మకు, ఐఆర్ఎస్ రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు టార్పాలిన్, వంట సామగ్రి, రగ్గు, కూరగాయలు, బియ్యం అందజేశారు. సొసైటీ సహాయ కార్యదర్శి బోణం రాజు, సొసైటీ ప్రతినిధులు అల్లూరి మధురాజు, తాడి సహదేవ్, అల్లూరి సత్యనారాయణరాజు, జానకిరామరాజు, తోలేటి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఉయ్యూరువారి మెరకలో బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న బుజ్జిరాజు

భారీ అన్న సమారాధన

మామిడికుదురు: గ్రామ దేవత పల్లాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా మొగలికుదురు గ్రామంలోని జగ్గన్నపేటలో శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ నెల 24వ తేదీన ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా జరిపించారు. ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన జాతర మహోత్సవాలు అన్న సమారాధనతో సంపూర్ణమయ్యాయి. జాతర మహోత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు.

ధీరవనిత అహల్యాబాయి

మామిడికుదురు: ఆసేతు హిమాచలం వరకు హిందూ దేవాలయాల పునరుద్ధరణ చేసిన ధీర వనిత అహల్యాబాయి హోల్కర్ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ వేమా అన్నారు. అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా మామిడికుదురులో బీజేపీ మండల అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం ఆమె జీవిత చరిత్ర కరపత్రాలు పంచారు. అనంతరం జరిగిన సమావేశంలో వేమా మాట్లాడుతూ, సుపరిపాలన, దూరదృష్టి, సేవ, ధర్మ రక్షణ, ఆధ్యాత్మిక కృషి, న్యాయం, సామాజిక సంస్కరణలు వంటి వాటిలో ఆరితేరిన పుణ్యమూర్తి అహల్యాబాయి అని కొనియాడారు.

బెల్లంపూడిలో..

పి.గన్నవరం: పవిత్రమూర్తి అహల్యాబాయి హోల్కర్ జయంతిని బీజేపీ మండల అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో బెల్లంపూడి గ్రామంలో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిగింది.


మామిడికుదురులో కరపత్రాలు పంచుతున్న నాయకులు

వేతనాల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం

అమలాపురం రూరల్: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. తక్షణం నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం గున్నేపల్లిలో జరిగే బహిరంగ సభలో సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందిస్తామని ఆయన తెలిపారు. అమలాపురం మండలం పేరూరు గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీల సమస్యలను వెంకటేశ్వరరావు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన బకాయిలు విడుదల కాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కూలీల నోటితోనే ఈ పథకం మాకు వద్దని చెప్పించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. జిల్లాలో సుమారు రూ.60 కోట్ల వేతన బకాయిలు విడుదల చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. పనులు లేని కాలంలో వ్యవసాయ కార్మికులకు ఆరు నెలల పాటు రూ.6 వేలు ప్రతి కుటుంబానికి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అది నేటికీ ఆచరణకు నోచుకోలేదని విమర్శించారు. జిల్లా నాయకుడు పి.శివ, మేట్లు జల్లి సీతా మహాలక్ష్మి, జల్లి దుర్గాభవాని, గుబ్బల పార్వతి, ఎన్.నాగరాజు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పేరూరులో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వెంకటేశ్వరరావు

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక మధ్య గ్రూపులో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు ఎమ్మెల్యేను కలిశారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటు, శ్మశాన వాటికకు స్థలం కేటాయించేలా చూడాలని కోరారు. సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి రెవ.బీవీ రత్నం, బందెల శరత్‌రాయ్, దిడ్ల శ్రీనివాస్, కాట్రు సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

కేడీఆర్ క్షమాపణ చెప్పాలి

పి.గన్నవరం: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరిస్తూ అసత్య ఆరోపణలు చేసిన కృష్ణ ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేడీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని ఎల్.గన్నవరం గ్రామ జనసేన నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్.గన్నవరం ఆంజనేయ స్వామివారి ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు యర్రంశెట్టి వెంకటరమణ, గనిశెట్టి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. సంబంధం లేని విషయంలో ఎమ్మెల్యేపై కేడీఆర్ సోషల్ మీడియాలో హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించి పోస్టులు పెట్టారని ఆరోపించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపేట: ప్రతి రోజూ గంట పాటు యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని, జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, యోగా, వ్యాయామ విద్యా పితామహుడు మోటూరి భైరవ స్వామి అన్నారు. స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా సంస్థల నిర్వాహకుడు, ప్రముఖ యోగా శిక్షకుడు ఆకుల శ్రీనివాస్ (యోగా శ్రీను) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భైరవ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో నిత్యం యోగాసనాలు, ప్రాణాయామం, మెడిటేషన్ ద్వారా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అనంతరం యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా స్టూడెంట్స్ భైరవస్వామిని ఘనంగా సత్కరించారు. చిన్న పిల్లలకు యోగాసనాల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు.

యోగా ఉత్తమ మార్గం

మానసిక ప్రశాంతతకు యోగా ఉత్తమ మార్గమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. అంతర్జాతీయ యోగా ఉత్సవాల్లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఫిజికల్ డైరెక్టర్, యోగా ట్రైనర్ కె.కనకరాజు విద్యార్థులు, కళాశాల సిబ్బందితో యోగా అభ్యసనాలు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది బీహెచ్ సాయిబాబా, సీహెచ్ నాగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో భైరవస్వామిని సత్కరిస్తున్న యోగా గురువు, స్టూడెంట్స్

అంతర్వేది దేవస్థానంలో..

సఖినేటిపల్లి: యోగాంధ్రలో భాగంగా అంతర్వేది దేవస్థానంలో యోగా గురువు మన్నె సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. ఆసనాలు, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. అనంతరం సత్యనారాయణను స్థానికులు సత్కరించారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు, పంచాయతీ సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

ఆలమూరు: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఎంపీడీఓ ఏ రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు యోగా నేర్చుకుని, అందులోని మెళకువలను ప్రజలకు తెలియజేయాలన్నారు. జూన్ 21న జరిగే యోగా డేలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మానసికోల్లాసం

అయినవిల్లి: నిత్యం యోగాను అభ్యసించడం ద్వారా ఆరోగ్యంతో పాటు, మానసికోల్లాసం అలవడుతోందని సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యాలయ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో యోగా గురువు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయవచ్చన్నారు. యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఎస్.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట డిగ్రీ కళాశాలలో చేస్తున్న యోగా సాధన


అంతర్వేది దేవస్థానంలో..


ఆలమూరులో జరిగిన యోగా శిక్షణ తరగతులు

నదీకోత నివారణకు చర్యలు

మామిడికుదురు: నదీకోత నివారణకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం పాశర్లపూడి, బి.దొడ్డవరం గ్రామాల్లో నదీకోతకు గురవుతున్న తీర ప్రాంత భూములను, కొబ్బరి తోటలను పరిశీలించారు. బోటులో వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించి, తీర గ్రామాల రైతులతో మాట్లాడారు. దశాబ్దాల తరబడి నదీకోత సమస్య తమను వేధిస్తోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరా రు. ఎంతో విలువైన, సారవంతమైన భూములను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, కోత నివారణకు గ్రోయన్లు, రివిట్‌మెంట్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.